క్లుప్తంగా

ఆలయాల హుండీ కానుకల లెక్కింపు



పాత గుంటూరు: దేవాదాయ శాఖ పరిధిలోని కొత్తపేట శ్రీ ఆంజనేయస్వామి, జగన్నాథ స్వామి, లాలాపేటలోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానాల్లో గురువారం హుండీలు లెక్కించగా రూ.8,17,511 ఆదాయం వచ్చిందని ఈవో కె. సూర్యప్రకాశరావు తెలిపారు. శ్రీ జగన్నాథస్వామి దేవస్థానానికి రూ.10 వేలు, శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానానికి రూ. 3,14,463, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానానికి రూ.4,93,042 వచ్చిందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీ రామకోటి తులసీ సహస్ర నామార్చనలు



పాత గుంటూరు: సంపత్ నగర్ శ్రీ రామనామ క్షేత్రంలో రామనామ క్షేత్ర ట్రస్టీస్ రాగం వెంకట లీలాసుందరి , మస్తానరావు దంపతుల ఆధ్వర్యంలో 97వ శ్రీ రామకోటి మహోత్సవ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహించారు. గురువారం ఉదయం ఆలయ అర్చకులు క్రోసూరి మురళీ కృష్ణమాచార్యులు నిర్వహణలో ధ్వజారోహణం, విశేషంగా పాల్గొన్న సువాసినులతో శ్రీరామకోటి తులసీ సహస్ర నామార్చనలు, ఆధ్యాత్మిక ఉపన్యాసాలు జరిగాయి. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం భజనలు, కీర్తనలు ఆకట్టుకున్నాయి. అనంతరం శ్రీ రామకోటి పుస్తకాలతో శేష వాహనంపై నగరోత్సవం నిర్వహించారు. శుక్రవారం ఉదయం శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం, సాయంత్రం నగరోత్సవం ఉంటాయని లీలాసుందరి తెలిపారు. కార్యక్రమాల్ని కె.వి. సుబ్బారావు, బ్రహ్మయ్యనాయుడు, కార్యవర్గం పర్యవేక్షించారు.

పారా స్పోర్ట్స్‌లో రాణించడం అభినందనీయం: మేయర్



నెహ్రూనగర్: నగరానికి చెందిన బి.వి.మురళీ కృష్ణ పారా స్పోర్ట్స్‌లో రాణించడం అభినందనీయమని మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు అభినందించారు. విశాఖపట్నంలో ఈ నెల 24న జరిగిన రాష్ట్రస్థాయి పారా స్పోర్ట్స్‌లో అథ్లెటిక్ పోటీల్లో(షాట్ పుట్ , జావలిన్, డిస్కస్ త్రో) సిల్వర్ మెడల్స్ సాధించిన సంపత్ నగర్‌కు చెందిన మురళీకృష్ణను గురువారం తన క్యాంపు కార్యాలయంలో మేయర్ కావటి శివ నాగ మనోహర్ నాయుడు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో మరిన్ని పోటీల్లో పాల్గొని, అత్యుత్తమ ప్రతిభ కనబరచి గోల్డ్ మెడల్స్ సాధించి గుంటూరు నగరానికి పేరు, ప్రఖ్యాతులు తేవాలని ఆయన ఆకాంక్షించారు.

వికసిత్ భారత్ క్యాంపెయిన్ పోస్టర్ ఆవిష్కరణ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో వికసిత్ భారత్ – 2047 (వాయిస్ ఆఫ్ యూత్) క్యాంపెయిన్ పోస్టర్‌ను గురువారం వీసీ ఆచార్య పి.రాజశేఖర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ క్యాంపెయిన్ విజయవంతం చేసి విద్యార్థులంతా తమ సూచనలు, సలహాలు ఇచ్చి దేశ వికాసానికి తోడ్పడాలని సూచించారు. వికసిత్ భారత్ వర్సిటీ కో–ఆర్డినేటర్ ప్రొఫెసర్ పి. సిద్ధయ్య మాట్లాడుతూ విద్యార్థులంతా ఈ క్యాంపెయిన్‌లో రిజిస్టర్ అవ్వాలని కోరారు. వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాలలో విద్యార్థులకు కార్యక్రమంపై వీడియో, పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రెక్టార్ ప్రొఫెసర్ పి. వరప్రసాదమూర్తి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి. కరుణ, దూరవిద్యా కేంద్రం డైరెక్టర్ డాక్టర్ బి. నాగరాజు, అంబేడ్కర్ చైర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అబ్రహం లింకన్, వికసిత్ భారత్ – 2047 అసిస్టెంట్ కో–ఆర్డినేటర్స్ డాక్టర్ తౌసిఫ్ అహ్మద్, డాక్టర్ సీహెచ్. ఉమా శంకర్ పాల్గొన్నారు.

అక్రమంగా మద్యం అమ్మితే కఠిన చర్యలు

వట్టిచెరుకూరు(పెదనందిపాడు): గ్రామాల్లో అక్రమంగా మద్యం అమ్మే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వట్టిచెరుకూరు ఎస్‌ఐ కోటేశ్వరరావు హెచ్చరించారు. మండలంలోని పల్లపాడులో గురువారం మధ్యాహ్నం అక్రమంగా మద్యం అముతున్న కూరపాటి సాంబశివరావును అదుపులోకి తీసుకుని ఆరు క్వార్టర్ బాటిళ్లు, ముట్లూరులో ఎనుముల రాజేష్‌ను అదుపులోకి తీసుకుని ఏడు క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ చెప్పారు.

ఆటల వేడుక.. తగ్గేది లేదిక!

- గుంటూరు నగరంలో ఉత్సాహంగా క్రీడా పోటీలు
- తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల పరిధిలో ఏడు జోన్లగా విభజన
- 209 వార్డు సచివాలయాల స్థాయిలో ఈనెల 30 వరకు పోటీల నిర్వహణ



ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో బ్యాడ్మింటన్ పోటీలను పర్యవేక్షిస్తున్న పీఈటీలు, వార్డు సచివాలయాల సిబ్బంది

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు, యువతరంలో క్రీడాసక్తిని పెంపొందించి మేటి క్రీడాకారులుగా తీర్చిదిద్దే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన ఆడుదాం.. ఆంధ్రా గుంటూరు నగరంలో ఉత్సాహంగా కొనసాగుతోంది. తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల పరిధిలోని 209 వార్డు సచివాలయాల స్థాయిలో పోటీలు జరుగుతున్నాయి. నగరంలోని వివిధ క్రీడా ప్రాంగణాల్ని ఏడు జోన్లుగా విభజించి, విద్యార్థులు, యువతతో పాటు క్రీడలపై ఆసక్తి కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం పోటీల్లో పాల్గొనే అవకాశాన్ని కల్పించింది. పాత గుంటూరులోని బీఆర్ స్టేడియం, పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల, నల్లచెరువులోని మహావీర్ కాలేజీ, బృందావన్ గార్డెన్స్‌లోని ఎన్టీఆర్ స్టేడియం, మల్లారెడ్డినగర్‌లోని రెడ్డి కాలేజీ, ఏటీ అగ్రహారంలోని ఎస్‌కేబీఎం నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాల్లో ఈనెల 26న ప్రారంభమైన వార్డు సచివాలయస్థాయి క్రీడా పోటీలు ఈనెల 30వ తేదీ వరకు కొనసాగనున్నాయి. తదుపరి జనవరి రెండో తేదీ నుంచి ఆరు వరకు మండలస్థాయిలో, అనంతరం నియోజకవర్గ, జిల్లాస్థాయిల్లో పోటీలు జరుగుతాయి. ఆయా వార్డు సచివాలయాల అడ్మిన్లు, వలంటీర్లతో పాటు వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం పాత బస్టాండ్ సెంటర్లోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో నిర్వహించిన క్రీడా పోటీల్లో వివిధ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా పోటీల్ని వ్యాయామ ఉపాధ్యాయులు ఎస్. శాంతకుమారి (ఉర్దూ బాయ్స్ హైస్కూల్), జి. ఆంజనేయులు (యాదవ హైస్కూల్), ఆర్. శ్రీనివాసరావు (ఏపీ ఆర్ఎస్ హైస్కూల్, నందివెలుగురోడ్డు) సమన్వయపరిచారు.

జగనన్నను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం

ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్



ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలి కార్యక్రమంలో మాట్లాడుతున్న కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్ (పెదనందిపాడు): వచ్చే ఎన్నికల్లో అందరం కష్టపడి పనిచేసి వైఎస్. జగన్‌మోహనరెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. 41 డివిజన్‌లో 176, 179 సచివాలయం పరిధిలోని పుచ్చలపల్లి సుందరయ్యనగర్‌లో గురువారం సాయంత్రం ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలి? కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కిరణ్‌కుమార్ మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో ఇచ్చిన హామీల్ని 99 శాతం నెరవేర్చిన ఘనత సీఎం వైఎస్. జగన్‌మోహనరెడ్డికే దక్కుతుందని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీల్ని విస్మరించారని, ప్రజలకు ఆయన చేసిందేమి లేదని విమర్శించారు. జగనన్న అన్ని సంక్షేమ పథకాల్ని అమలు చేస్తుంటే రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి దించుతున్నాడని నారా చంద్రబాబు నాయుడు, పవన్ కల్యాణ్ విమర్శించడం తగదని తెలిపారు. ఎన్నికలు దగ్గర పడుతుండటంతో చంద్రబాబు నాయుడు మరిన్ని సంక్షేమ పథకాలు ప్రకటిస్తున్నాడని, అయినా ఆయన మాటల్ని ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. ఈ విషయాల్ని పార్టీ నేతలంతా ప్రజలకు వివరంగా చెప్పాలని కిరణ్‌కుమార్ సూచించారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గురించి ప్రజలకు వివరించి, వారిని చైతన్య పరచాలని దిశా నిర్దేశం చేశారు. ప్రభుత్వం చేసిన మంచి పనుల గురించి తెలియజేయాలని, అదే సమయంలో ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న కుట్రలు, కుతంత్రాల గురించి ప్రజలకు వివరించాలని ఆయన ప్రజా ప్రతినిధులకు, నాయకులకు సూచించారు. మన రాష్ట్రం సంక్షేమ పాలనలో ముందుకు వెళుతున్నదని, రాబోయే రోజుల్లో ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు మన ముఖ్యమంత్రి అందిస్తారని ఆయన చెప్పారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇంచార్జి బి. శ్రీనివాసరావు, 41వ డివిజన్ కార్పొరేటర్ స్మితపద్మజ, పలకలూరు కార్పొరేటర్ వై. సాంబిరెడ్డి, ఆర్ అండ్ బీ డైరెక్టర్ పిల్లి మేరి, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్లు ఇంద్ర, ఆర్. ముత్యాలరాజు, పార్టీ నాయకులు మెట్టు వెంకటప్పారెడ్డి, అంకం అరుణ, బాజి, వెంకట బుజ్జి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను ప్రజలకు వద్దకు తీసుకువెళ్లాలి

గుంటూరు రూరల్(కాకుమాను): రానున్న ఎన్నికల్లో గత నాలుగున్నర సంవత్సరాల నుంచి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్ని ప్రజల వద్దకు తీసుకువెళ్లాలని ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ చెప్పారు. గుంటూరు రూరల్ మండలంలోని ఏటుకూరు బైపాస్ సమీపంలో ఏర్పాటు చేసిన పార్టీ కార్యాలయంలో గురువారం మధ్యాహ్నం కాకుమాను మండల వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఎన్నికలలో చేసిన వాగ్దానాలతో పాటు అనేక సంక్షేమ పథకాల్ని సకాలంలో సక్రమంగా అర్హులందరికీ అందించిన ఏకైక నాయకుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అని ఆయన తెలిపారు. ప్రభుత్వం ఇప్పటి వరకు అమలు చేసిన ప్రతి పథకం గురించి ప్రజలకు వివరించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన చెప్పారు. ప్రత్తిపాడు నియోజక వర్గాన్ని జగనన్న అడ్డాగా మార్చి, త్వరలో జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని అత్యధిక మెజార్టీతో గెలుపించుకుని జగనన్నకు కానుకగా ఇద్దామని ఆయన పిలుపునిచ్చారు.

ఉత్కంఠగా ఎడ్ల బండ లాగుడు ప్రదర్శన

సత్తా చాటుతున్న ఒంగోలు జాతి కోడెదూడలు



జాతీయ స్థాయి బండలాగుడు ప్రదర్శనలో ఎడ్ల జతలు

పెదకాకాని: జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న వృషభరాజముల బండలాగుడు ప్రదర్శనల్లో కోడె దూడలు హోరాహోరీగా సాగాయి. పెదకాకాని మండలంలోని కొప్పురావూరులో జాతీయ స్థాయి ఒంగోలు జాతి వృషభరాజము బండలాగుడు ప్రదర్శనలు గురువారం రెండో రోజుకు చేరాయి. ఎండ్ల పందేల నిర్వాహకుడు, కొప్పురావూరు పీఏసీఎస్ అధ్యక్షుడు తోట శ్రీనివాసరావు మాట్లాడుతూ ఆరుపళ్ల విభాగంలో 12 జతలు పాల్గొన్నాయన్నారు. తొలిరోజు నాలుగు పళ్ల విభాగంలో పూర్తి కాగా, రెండో రోజు ఆరు పళ్ల విభాగంలోనూ పూర్తయినట్లు పేర్కొన్నారు. 29వ తేదీన వ్యవసాయ విభాగంలోను, 30వ తేదీ సబ్ జూనియర్స్, 31వ తేదీన జూనియర్స్ విభాగంలోనూ, జనవరి 1వ తేదీన సీనియర్స్ విభాగంలోనూ పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు కేటగిరీల వారీగా రూ.6,000 నుంచి రూ.లక్ష వరకూ అన్ని విభాగాల్లో 9వ జత వరకూ బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకుడు తోట శ్రీనివాసరావు తెలిపారు.

గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే ధ్యేయం

జాయింట్ కలెక్టర్ రాజకుమారి



ఫిరంగిపురం: గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించడమే ప్రభుత్వ ధ్యేయంగా ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మార్నింగ్‌స్టార్ కళాశాలలో నిర్వహిస్తున్న క్రికెట్ పోటీలను గురువారం పరిశీలించారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న షటిల్ బ్యాడ్మింటన్ పోటీలను టాస్‌వేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 1,43,039 మంది క్రీడాకారులు ఆడుదాం ఆంధ్రా కోసం పేర్లు నమోదు చేసుకున్నారని చెప్పారు. వాటిలో 567 సచివాలయాలకు గాను ఐదు క్రీడలకు గాను 13వేల 174టీంలుగా ఏర్పాటు చేశామన్నారు. వారితో 229 గ్రౌండ్‌లలో క్రీడలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వారికి అవసరమైన 22వేల 453క్రీడా పరికరాలు , కిట్లు, మెడల్స్, ట్రోఫీలు, సర్టిఫికెట్లు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. ఆమె వెంట మండల ప్రత్యేకాధికారి ఎం.వెంకటరామిరెడ్డి, తహసీల్దార్ పద్మనాభుడు, ఎంపీడీఓ విలియమ్స్, సర్పంచి మేడాబాబు పాల్గొన్నారు.

మంగళగిరి చేరుకున్న వడ్డెర్ల పాదయాత్ర



తిరుపతి నుంచి మంగళగిరికి చేరుకున్న వడ్డెర సంఘం నాయకులు

తాడేపల్లిరూరల్: ఎస్టీ రిజర్వేషన్ సాధన లక్ష్యంగా నిర్వహిస్తున్న వడ్డెర మహాపాదయాత్ర గుంటూరు జిల్లా మంగళగిరి పట్టణానికి గురువారం చేరింది. నాయకులు మాట్లాడుతూ నవంబర్ 22న తురక అమరనాథ్ ఆధ్వర్యంలో తిరుపతి అలిపిరి పాదాల వద్ద నుంచి ప్రారంభించి విజయవాడ కనకదుర్గమ్మ పాదాల వరకు ఈ పాదయాత్ర నిర్వహిస్తున్నామని తెలిపారు. వడ్డెర్లు అన్ని విధాలుగా ఎస్టీ రిజర్వేషన్‌కు అర్హులని, అనేక కమిటీలు, కమిషన్లు, భారత ప్రభుత్వానికి నివేదికలు అందించాయని, ఆ నివేదికలు నేటికీ అమలుకు నోచుకోలేదని అన్నారు. గతంలో సత్యపాల్ కమిటీ కొన్ని జిల్లాల్లో పర్యటనలు జరిపి వడ్డెర కులస్తుల జీవిత స్థితిగతులపై అధ్యయనం చేసిందని గుర్తు చేశారు. నేటికీ వడ్డెర్లు కొంతమంది సంచార జీవితం గడుపుతూ నిరక్షరాస్యతతో, పేదరికంలో ఉన్నారనేది వాస్తవమని, ఈ విషయాన్ని ప్రభుత్వం గుర్తించాలని కోరారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాల్లో వడ్డెర్లు ఎస్సీలుగాను, నాలుగు రాష్ట్రాల్లో ఎస్టీలుగాను కొనసాగుతున్నారని, కానీ తెలుగు రాష్ట్రాల్లో మాత్రమే బీసీ రిజర్వేషన్ జాబితాలో కొనసాగుతున్నారని తెలిపారు. వడ్డెర్లను ఎస్టీ జాబితాలో చేర్చించాలని, ప్రభుత్వం ఆ దిశగా ప్రయత్నాలు చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వడ్డెర ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ దేవళ్ల రేవతి, వడ్డెర యువ చైతన్యం రాష్ట్ర కార్యదర్శి కుంచాల కిషోర్, బీసీ సంఘం నాయకులు రమణ పాల్గొన్నారు.

వైభవంగా చంద్రశేఖరస్వామి ఆర్ద్రా మహోత్సవాలు



అవధాని గరికపాటి నరసింహారావును ఆహ్వానిస్తున్న ఉత్సవాల కమిటీ సభ్యులు

పెదకాకాని: మండలంలోని తక్కెళ్లపాడులో శ్రీ గంగా భ్రమరాంబ సమేత చంద్రశేఖరస్వామి 81వ ఆర్ద్రా మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఐదు రోజుల పాటు జరిగే ఉత్సవాల్లో భాగంగా రెండవ రోజు గురువారం ఉదయం శుభోదయంతో పూజలు ప్రారంభయ్యాయి. శ్రీ స్వామివారికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, శ్రీ అమ్మవారికి సహస్ర కుంకుమార్చన, భస్మాభిషేకం, శ్రీభద్రకాళి సమేత శ్రీ వీరభద్రస్వామికి పూజలు, గ్రామోత్సవం, గో పూజలు, శ్రీ స్వామివారికి సహస్ర కలశాభిషేకం, అమ్మవారికి అష్టోత్తర కుంకుమార్చనలు నిర్వహించారు. నామ సంకీర్తన, కోలాటం, శ్రీ స్వామివారికి సహస్ర దీప లింగార్చన భక్తిశ్రద్ధలతో జరిపారు. అనంతరం మహా సహస్రావధాని డాక్టర్ గరికపాటి నరసింహారావు శివతత్వం అనే అంశంపై ప్రవచనం చేశారు. ముందుగా ఆయనకు నిర్వాహక కమిటీ సభ్యులు ఆత్మీయ స్వాగతం పలికారు. స్వామివారి ఆర్ద్రా మహోత్సవాల్లో పాల్గొన్న భక్తులందరికీ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

యర్రబాలెంలో ఓ ఇంట్లో చోరీ

తాడేపల్లిరూరల్: మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని యర్రబాలెంలో చోరీపై మంగళగిరి రూరల్ పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ క్రాంతి తెలిపిన వివరాలు.. యర్రబాలెం శ్రీరామానగర్‌లో నివాసముంటున్న ఖాజావలీ ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తున్నాడు. ఖాజావలీ తల్లిదండ్రులు మొహమ్మద్ రఫీఉల్లా బేగ్, తల్లి ముంతాజ్ బేగం అదే ప్రాంతంలోని మరో వీధిలో నివాసముంటున్నారు. ఇటీవల తండ్రి మృతి చెందడంతో ఆయన నివసిస్తున్న ఇంటికి తాళం వేసి తల్లిని తనతో తీసుకెళ్లాడు. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ఖాజావలి బేగ్ నివాస గృహంలో చొరబడి బీరువా తాళాలు పగలకొట్టి బీరువాలో దాచిన మూడు బంగారం ఉంగరాలు, వెండి చైన్, చెవిదిద్దులు, రెండు జతల వెండి పట్టీలు, ఐదు జతల వెండి మెట్టెలను దొంగిలించుకుపోయారు. ఈ ఘటనపై ఖాజావలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ క్రాంతి తెలిపారు.

సీఎం జగన్ పాలనలో పేదలు ఆర్థికాభివృద్ధి



డివిజన్ పరిధిలో స్థానికుల సమస్యలను తెలుసుకుంటున్న నూరిఫాతిమా

పట్నంబజారు: పేద, బడుగు, బలహీన వర్గాల జీవన ప్రమాణాలు మెరుగుపడే విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా చెప్పారు. తూర్పు నియోజకవర్గంలోని 54వ డివిజన్, రాజీవ్‌గాంధీనగర్‌లో గురువారం 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం నాలుగున్నరేళ్లలో పేద ప్రజలకు విలువైన విద్య, వైద్యం, సంక్షేమం అందించడంతో పాటు, ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లారన్నారు. ప్రతి నిరుపేద కుటుంబం ఆర్థికాభివృద్ధి చెందిందని తెలిపారు. సీఎం జగన్‌ను మరోమారు ముఖ్యమంత్రిని చేసుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మల్లవరపు రమ్య, వైఎస్సార్ సీపీ నేతలు అగ్గిపెట్టిరాజు, దాసు, రవిరాజ్ పాల్గొన్నారు.

పలు వార్డుల్లో పర్యటన

గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని 11వ డివిన్ యానాది కాలనీ, రెండో డివిజన్ మణిపురం బ్రిడ్జి ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ నూరిఫాతిమా పర్యటించారు. స్థానికంగా ఉన్న సమస్యలను అక్కడి ప్రజల్ని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ఆబిద్ బాషా పాల్గొన్నారు.

బోధనలో ఆధునికత ప్రవేశపెడుతున్న ప్రభుత్వం



మాట్లాడుతున్న ఉర్దూ డీఐ ఖాసిం

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యా బోధనలో ప్రభుత్వం కాలానుగుణంగా తీసుకువస్తున్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఉపాధ్యాయులు సమగ్ర అవగాహన పెంచుకోవాలని ఉర్దూ పాఠశాలల ఉప తనిఖీ అధికారి షేక్ మొహ్మద్ ఖాసిం పేర్కొన్నారు. బీఆర్ స్టేడియం ఎదుట ఉన్న పులిపాక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఖాసిం మాట్లాడుతూ ఆధునిక విద్యాబోధన పద్ధతులపై నిరంతరం నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాల్ని ఉపాధ్యాయులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అత్యుత్తమ మెటీరియల్‌తో పాటు బోధనలో నిపుణులైన ఉపాధ్యాయుల్ని రిసోర్స్ పర్సన్లుగా ఎంపిక చేసి, అత్యుత్తమ శిక్షణ అందిస్తున్నట్లు చెప్పారు. మైనారీల అభ్యున్నతికి కృషి చేస్తున్న ప్రభుత్వం, ఉర్దూ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అన్ని సదుపాయాలతో కూడిన అత్యుత్తమ విద్య అందిస్తోందని తెలిపారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్ని సద్వినియోగం చేసుకుని, విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. శిక్షణ తరగతుల్లో ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు బి.వి. రమణయ్య, ఎస్వీఆర్ ప్రసాద్, వివిధ మండలాలకు చెందిన ఉర్దూ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అపూర్వ గ్రంథ సేకర్త లంకా సూర్యనారాయణ

సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సాధు నరసింహారెడ్డి



పుస్తకాలు చూస్తున్న నరసింహారెడ్డి

పాత గుంటూరు: అమూల్యమైన గ్రంథాలను వేలాదిగా సేకరించిన అపూర్వ గ్రంథ సేకర్త లంకా సూర్యనారాయణ అని జీఎస్టీ సెంట్రల్ కమిషనర్ సాధు నరసింహారెడ్డి కొనియాడారు. బృందావన్ గార్డెన్స్‌లోని అన్నమయ్య గ్రంథాలయాన్ని గురువారం ఆయన సందర్శించారు. ప్రతి విభాగంలో పుస్తకాలను పరిశీలించారు. గ్రంథాల ప్రాధాన్యత, ప్రాముఖ్యతను వ్యవస్థాపకుడు లంకా సూర్యనారాయణ వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ నరసింహారెడ్డి మాట్లాడుతూ లంకా సూర్యనారాయణ సేకరించిన విజ్ఞాన భాండాగారమే అన్నమయ్య గ్రంథాలయమని పేర్కొన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాల్ని భావితరాలకు పుస్తకాల ద్వారా వ్యాపింప చేయడం అభినందనీయమన్నారు. ఇది తెలుగు భాషకి చేస్తున్న సేవ అని కొనియాడారు. పుస్తక ప్రపంచానికి సూర్యనారాయణ అందిస్తున్న సేవలు స్ఫూర్తి దాయకమని పేర్కొన్నారు. అనంతరం కమిషనర్‌ను లంకా సూర్యనారాయణ సత్కరించారు. కార్యక్రమంలో గుమ్మడి సీతారామయ్య, లంకా విజయ శారద, లైబ్రేరియన్ సుభాషిణి, కాకర్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఆన్‌లైన్‌లో షేర్‌లు కొని మోసపోయిన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. బ్రాడీపేటలో నివాసం ఉండే కె.వి.సత్యనారాయణ ఆన్‌లైన్‌లో తొలుత రూ. 10వేలు పెట్టుబడి షేర్ కొని లాభం పొందాడు. దీంతో సత్యనారాయణ ఐఆర్ఈఏడీ వెబ్‌సైట్‌లో విడతల వారీగా రూ. 53 లక్షలు పెట్టుబడి పెట్టాడు. మొత్తం రూ. 1.25 కోట్ల లాభం వచ్చినట్లు చూపించింది. అయితే డబ్బు విత్‌డ్రా చేయబోతే రాలేదు. దీంతో సత్యనారాయణ వెబ్‌సైట్ నిర్వాహకుల్ని సంప్రదిస్తే ఎలాంటి సమాధానం లేదు. మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు గురువారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ మెడలో గొలుసు చోరీ

ఆగంతకుడు మహిళ మెడలో బంగారు గొలుసు తెంపుకుని పరారైన ఘటనపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పండరీపురం 6వ లైనులో నివసించే పి.పద్మావతి గురువారం నడుచుకుంటూ వెళుతోంది. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి హెల్మెట్ పెట్టుకుని ద్విచక్రవాహనంపై వచ్చి ఆమె మెడలోని 25 గ్రాముల బంగారు గొలుసు తెంచుకుని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మహిళ ఆత్మహత్య

మహిళ ఆత్మహత్యపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రామిరెడ్డినగర్‌లో నివాసం ఉండే శివశంకర్ భార్య మరియకుమారి కుటుంబ కలహాల నేపథ్యంలో గురువారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుని మృతి చెందింది. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేయండి

ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

మేడికొండూరు: సామాజిక సాధికార బస్సు యాత్ర ఈనెల 31వ తేదీన నియోజకవర్గంలోని తాడికొండలో నిర్వహించనున్నట్లు నియోజకవర్గ సమన్వయకర్త, ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరిత తెలిపారు. మండల పరిధిలోని పేరేచర్ల సాయికృష్ణ కల్యాణమండపంలో ఎంపీపీలు, జెడ్పీటీసీ, పార్టీ మండల అధ్యక్షులు, పలువురు ముఖ్య నాయకుల సమావేశం గురువారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చినట్లు చెప్పారు. ప్రజలకు చేకూరిన లబ్ధిని వివరించి వారికి అవగాహన కల్పించి, అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొని సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం అయ్యేలా చూడాలన్నారు. విజయవంతం చేసేందుకు అందరూ సమష్టిగా కృషి చేయాలన్నారు. ప్రణాళికా బద్ధంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు ముందుకు వెళ్లాలన్నారు. తాడికొండ అడ్డరోడ్డు నుంచి ప్రారంభమయ్యే బస్సు యాత్ర బస్టాండ్ వరకు కొనసాగుతోందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు కందుల సిద్ధయ్య, ఎంపీపీ మన్నవ స్వప్నరాజేష్, పార్టీ మండల అధ్యక్షుడు తాళ్లూరి వంశీకృష్ణ, వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్ బాజీ పాల్గొన్నారు.

రేపు కాపు రాజకీయ భవిష్యత్ కార్యాచరణపై సదస్సు



పాత గుంటూరు: గుంటూరు వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈనెల 30న ఉమ్మడి గుంటూరు జిల్లా కాపుల రాజకీయ భవిష్యత్తు కార్యాచరణపై చైతన్య సదస్సు నిర్వహించనున్నట్లు కాపు, తెలగ, బలిజ, జేఏసీ కన్వీనర్ దాసరి రాము, కాపు రాజకీయ చైతన్య వేదిక బి. శివరాం తెలిపారు. అరండల్‌పేటలోని ఓ హోటల్లో గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం కాపులకు టికెట్లు కేటాయించాలని కోరుతూ నిర్వహించనున్న ఈ సదస్సు ఆ రోజు ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు. ఈ సదస్సులో అన్ని నియోజకవర్గాలకు చెందిన కాపు సంఘీయులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే లింగంశెట్టి ఈశ్వరరావు, పగడాల సీతారామయ్య, నారదాసు శ్రీహరి, కాపు నాయకులు పాల్గొన్నారు.